నికొలస్ శామ్యూల్ గుగర్.. జన్మతః భారతీయుడైన స్విట్జర్లాండ్ ఎంపీ. ఉడుపి దగ్గర్లోని ఓ దవాఖానలో పుట్టాడు. జన్మనిచ్చిన అమ్మ మలయాళీ వనిత. పేరు అనసూయ.. బిడ్డను డాక్టర్ చేతిలో పెట్టి వెళ్లిపోయింది. ఆ పసిగుడ్డును స్విట్జర్లాండ్‌కు చెందిన దంపతులు దత్తత తీసుకున్నారు. ఆ బాలుడే.. నేడు స్విస్ పార్లమెంట్ సభ్యుడి హోదాలో జన్మభూమికి, కర్మభూమికి మధ్య సౌభ్రాతృత్వపు వంతెన నిర్మిస్తున్నాడు. రెండు దేశాల మధ్య ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ కోసం కృషి చేస్తున్నాడు. తాజా ఇంటర్వ్యూలో గతాన్ని నెమరేసుకున్నాడు నికొలస్.



# ఇక్కడ అనాథ.. అక్కడ ఎంపీ!



నికొలస్ శామ్యూల్ గుగర్

నేనెవరు? నా మూలాలు ఏమిటి? ఇంటా, బయటా అందరి రంగూ ఒకలా ఉంది. నేను మాత్రం ఇలా.. చామనఛాయగా? నేను ఇక్కడి వాడిని కాదా? అచ్చమైన భారతీయుడిలా కనిపించే నేను స్విట్జర్లాండ్‌లో ఎందుకున్నాను?

.. ఎన్నో ప్రశ్నలు నన్ను వేధించేవి. శూలాల్లా గుచ్చుకునేవి. మొత్తానికి నా అన్వేషణ ఫలించింది. నా పరిశోధన ద్వారా కొంత తెలుసుకున్నాను. నన్ను పెంచిన తల్లిదండ్రులు ఇంకొన్ని వివరాలు అందించారు. రికార్డుల ప్రకారం మా అమ్మ పేరు అనసూయ. యాభై రెండేండ్ల క్రితం ఉడుపిలోని సర్కారు దవాఖానలో నాకు జన్మనిచ్చింది. ఆ కేరళ వనిత పేదరికమో, కుటుంబ పరిస్థితులో. కారణం ఏమిటో తెలియదు కానీ నన్ను డాక్టరుకు అప్పగించి నిశ్శబ్దంగా నిష్క్రమించింది. ఆ సమయంలో అమ్మ గుండెకోతను ఊహించగలను. అయినా, తన మీద నాకు ఏమాత్రం కోపం లేదు. ద్వేషం అసలే లేదు. ఇప్పటికీ.. అపారమైన ప్రేమ పొంగిపొర్లుతున్నది. తొమ్మిది నెలలూ నన్ను మోసి.. రక్తమాంసాలు పంచిన ఆ దేవతకు జన్మజన్మలకూ రుణపడి ఉంటాను. నా దృష్టిలో ఆమె మహా ధైర్యవంతురాలు. విధికి ఎదురొడ్డి నిలిచిన సమర్థురాలు. ఆ యుద్ధంలో నేనెక్కడ గాయపడతానో అనే భయంతో నన్ను వదిలి వెళ్లిందేమో. ఎవరికి తెలుసు? ఏదో ఒక రోజు తనను కలుసుకుంటానేమో! ఎక్కడున్నా తాను క్షేమంగా ఉండాలని దేవుణ్ని ప్రార్థిస్తాను. ఇప్పటికే మరణించి ఉంటే.. అమ్మ పవిత్ర ఆత్మకు శాంతి కలిగించమని ప్రార్థిస్తాను. నేనెప్పుడూ అమ్మను వెతికే ప్రయత్నం చేయలేదు. ఎందుకంటే, నన్ను అప్పగించి వెళ్తూ వెళ్తూ 'కంటికి రెప్పలా చూసుకునేవారికే నా బిడ్డను ఇవ్వండి. నా గురించి ఎప్పుడూ వాడికి చెప్పొద్దు' అని వేడుకుందట. అదే అమ్మ నిర్ణయం అయినప్పుడు, బిడ్డగా దాన్ని గౌరవించడం నా బాధ్యత. అమ్మ మీద ప్రేమతోనే నా పెద్ద కూతురికి అనసూయ అని పేరు పెట్టుకున్నాను. తనలోనే నా తల్లిని చూసుకుంటాను. 'అమ్మా..' అని నోరారా పిలుచుకుంటాను. ఎవరికి తెలుసు, ఆ తల్లి .. నా చిట్టితల్లిగా పుట్టిందేమో.



**నేను సగం భారతీయుడిని, సగం స్విస్ పౌరుడిని. ఇరు దేశాల సౌభాగ్యాన్నీ కోరుకుంటాను. ఇప్పటికి ఏడుసార్లు భారతదేశాన్ని సందర్శించాను. కర్ణాటకలో నేను పుట్టిన దవాఖానను, కేరళలో నేను పెరిగిన గ్రామాన్ని చూసొచ్చాను. భారత్-స్విట్జర్లాండ్ మధ్య సాంస్కృతిక సంబంధాన్ని నెలకొల్పడం నా బాధ్యతగా భావిస్తున్నాను. నా చొరవతో స్విస్-ఇండియన్ పార్లమెంటరీ గ్రూప్ ప్రారంభమైంది. ఇండియన్ ట్రేడ్ అండ్ ఎకనమిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్ అమలులోకి వచ్చింది. ఈ పునాది మీద భవిష్యత్తులో అనుబంధాల సౌధాన్ని నిర్మించాలని నా ఆకాంక్ష.**

**నన్ను పెంచిన దేవతలు**

స్విట్జర్లాండ్‌కు చెందిన ఫ్రిట్, ఎలిజబెత్ దంపతులు పదిహేను రోజుల పసికందుగా ఉన్న నన్ను దత్తత తీసుకున్నారు. నీడనిచ్చారు. చదువులు చెప్పించారు. వ్యక్తిత్వాన్ని ప్రసాదించారు. ఆ ఇద్దరూ కేరళలోని ఓ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లో కొంతకాలం పని చేశారు.. నాన్న ప్రిన్సిపల్, అమ్మ జర్మన్ టీచర్. స్వదేశానికి వెళ్తూ వెళ్తూ నన్నూ తీసుకెళ్లారు. అప్పటికి నాకు నాలుగేండ్లు. నిజానికి ఆ స్విట్జర్లాండ్ దంపతులు నన్ను మా అమ్మ ఒడికి చేర్చాలని ఎంతో ప్రయత్నించారు. 'అమ్మా.. ఇదిగో మీ కొడుకు! మా దగ్గర ఉన్నాడు. వచ్చి తీసుకెళ్లండి' అంటూ నా ఫొటోతో ఓ పత్రికా ప్రకటన కూడా ఇచ్చారు. ఆ కాపీ ఇప్పటికీ నా దగ్గర ఉంది. అయినా, ఎలాంటి స్పందనా కనిపించలేదు. దీంతో నన్ను దేవుడిచ్చిన బిడ్డగా భావించారు. వాళ్లేం సంపన్నులు కాదు. నా పెంపకం కోసం చాలా త్యాగాలు చేశారు. వాళ్లపై మరింత బరువు మోపడం ఇష్టం లేక.. చదువుకొంటూనే ట్రక్ నడిపాను. తోటమాలిగా పనిచేశాను. బాల్యం నుంచీ మనుషుల్ని, మనసుల్ని అర్థం చేసుకోవడం నాకు ఇష్టం. అందుకే సైకాలజీ చదివాను. నాన్న ఓ వృద్ధాశ్రమ నిర్వహణ బాధ్యతలు చూసుకునేవారు. దీంతో వయోధికులకు సేవ చేసే అవకాశం లభించింది. సునామీ సమయంలో ఎంతోమందికి మానసిక చికిత్స అందించాను. ఎంపీ అచ్యుత్ సామంత్‌తో కలిసి ఒడిశా గిరిజన ప్రాంతాల్లో పర్యటించాను. స్విట్జర్లాండ్‌లోనూ చురుకైన ప్రజా జీవితం నాది. కాబట్టే, టౌన్ కౌన్సెలర్ స్థాయి నుంచి ఎంపీ స్థాయికి ఎదిగాను. ప్రతి మహిళలోనూ అమ్మను చూసుకుంటున్నాను. ■